క్లుప్తంగా

లక్ష్యం మేరకు మొక్కలు నాటాలి

కర్లపాలెం: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని కర్లపాలెం ఎంపీడీవో, డీపీవో దాసరి రాంబాబు ఆదేశించారు. మొక్కలు నాటే కార్యక్రమంపై మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ గ్రీన్ బాపట్ల కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో మొక్కలు నాటాలని చెప్పారు. ఎన్ఆర్జీఎస్ సిబ్బంది సహకారంతో ఏర్పాట్లు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజల సహకారంతో నాటిన మొక్కలన్నీ పెంచేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు కేశవనారాయణరావు, ఈవోపీఆర్డీ ఎలీషాబాబు, ఏపీవో సంగీతరావు, గ్రామ పంచాయతీల కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 18 మందికి ఉద్యోగాలు

నగరం: స్థానిక ఎస్వీఆర్ఎం కళాశాలలో శుక్రవారం డీవీస్ ల్యాబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో 18 మంది విద్యార్థులకు ఉద్యోగావకాశాలు వచ్చినట్లు ప్లేస్‌మెంట్ ఆఫీసర్ గోగినేని హనుమంతరావు చెప్పారు. జాబ్ మేళాకు 84 మంది విద్యార్థులు హాజరు కాగా, 18 మందికి ఆపాయింటుగ్‌మెంట్‌లు ఇచ్చినట్లు తెలిపారు. మిగతా 66 మందిలో ఎంత మందికి ఉద్యోగావకాశాలు ఇచ్చేది 45 రోజులలో తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ బుచ్చియ్యచౌదరి, ప్రిన్సిపల్ హరికృష్ణ, డీవీస్ ల్యాబ్ హెచ్ఆర్‌లు కె.హరికృష్ణ, కె.శివనవీన్ పాల్గొన్నారు.

గిరిజనులపై దాడులకు పాల్పడితే కఠినంగా శిక్షించాలి

రేపల్లె రూరల్: గిరిజనులపై దాడులకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జై భీమ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు దోవా రమేష్ రాంజీ కోరారు. ఒంగోలులో నవీన్ అనే గిరిజన యువకుడిపై జరిగిన దాడిని ఖండించారు. మణిపూర్‌లో ముగ్గురు గిరిజన యువతులను నగ్నంగా ఊరేగించి అత్యాచారానికి పాల్పడి హత్య చేసిన దుండగులను బహిరంగంగా ఉరితీయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ, ఎస్టీ ప్రజా సంఘాలు, న్యాయవాదులు మానవహారంగా ఏర్పడి, నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో గిరిజన ఐక్యవేదిక ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాల కన్వీనర్ ఊసరపు వెంకటేశ్వర్లు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సజ్జ పద్మావతి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొడ్డు బసవ కోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు కట్టా రవికుమార్, మాజీ ఏజీపీ దారం సాంబశివరావు, మానవ హక్కుల సంఘం ప్రతినిధి నన్నెపాముల చంద్రశేఖర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

అనుబంధ కార్మికులకు 'నేతన్న నేస్తం' వర్తింపజేయాలి

భట్టిప్రోలు: చేనేతకు అనుబంధ కార్మికులకు నేతన్న నేస్తం వర్తింపజేయాలని ఏపీ చేనేత కార్మిక సంఘం బాపట్ల జిల్లా కమిటీ సభ్యులు మురుగుడు సత్యన్నారాయణ కోరారు. శుక్రవారం భట్టిప్రోలులోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రిబేట్ బకాయిలు, సబ్సిడీలు, త్రిఫ్ట్‌ఫండ్ కంట్రిబ్యూషన్‌కు సంబంధించి సహకార సంఘాలకు అందాల్సి ఉందన్నారు. ఇవి అందితే చేనేత కార్మికులు ఆదుకున్న వారు అవుతున్నారని తెలిపారు. సమావేశంలో చేనేత నాయకులు దీపాల సత్యన్నారాయణ, బి.నాగమల్లేశ్వరరావు, ఆకురాతి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణలో బాధ్యతగా వ్యవహరించాలి

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున
- నియోజకవర్గంలోని మండలాల్లో బూత్‌లెవల్ కన్వీనర్లతో సమావేశం
- ఓటరు నమోదు ప్రక్రియపై దిశానిర్దేశం చేసిన మంత్రి
- పథకాల అమలులో.. మాజీ మంత్రి నక్కా విమర్శలపై ఆగ్రహం


భట్టిప్రోలులో బూత్ లెవల్ కమిటీ నిర్వాహకులతో మాట్లాడుతున్న మంత్రి నాగార్జున

వేమూరు/అమర్తలూరు/చుండూరు/కొల్లూరు/భట్టిప్రోలు: ఓటరు జాబితా సమగ్ర సవరణ సర్వేలో గ్రామ సచివాలయ కన్వీనర్లు పూర్తి బాధ్యత వహించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. శుక్రవారం వేమూరు నియోజకవర్గంలోని బూత్ లెవల్ కమిటీ కన్వీనర్లతో మండలాల వారీగా ఆయన సమావేశాలు నిర్వహించారు. ఓటర్ల జాబితాలో సవరణలపై సర్వే జరుగుతున్న క్రమంలో కన్వీనర్లకు మంత్రి దిశానిర్దేశం చేశారు. వేమూరు మండల కేంద్రంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో మేరుగ నాగార్జున మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల సంఘం ఓటు నమోదు, తొలగింపులు, సవరణలపై ఈ నెల 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో కొత్త ఓటర్ల నమోదుకు ప్రభుత్వం బీఎల్వోలను కేటాయించిందని తెలిపారు. బీఎల్వోలతో పాటు గ్రామ సచివాలయం కన్వీనర్లు ఉండాలని ఆయన సూచించారు. గ్రామంలోని లేని, మరణించిన వ్యక్తుల పేర్లు వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి వ్యక్తికి ఓటు హక్కు కల్పించాలని మంత్రి స్పష్టం చేశారు.

దొంగ ఓట్లపై అప్రమత్తంగా ఉండాలి..

కొల్లూరు మండల కేంద్రంలోని ఎంప్లాయీస్ రిక్రియేషన్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో మంత్రి పాల్గొని, మాట్లాడుతూ... ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో బూత్ కన్వీనర్లు క్రియాశీలకంగా వ్యవహరించి, నిశితంగా పరిశీలించాలని సూచించారు. గత టీడీపీ ప్రభుత్వంలో తిరిగి అధికారం దక్కించుకునేందుకు ఎన్నో దొంగ ఓట్లు చేర్పించిదన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలని హెచ్చరించారు. దొంగ ఓట్ల తొలగింపు విషయంలో కీలకంగా వ్యవహరించాలని ఆదేశించారు. గత ఎన్నికలకు ముందు తెలుగుదేశం నాయకులు లేని ఓట్లను జాబితాలో చేర్పించి, అధికారం దక్కించుకునేందుకు కుయుక్తులు పన్నినప్పటికీ ప్రజలు వైఎస్సార్ సీపీకి పట్టం కట్టారని మంత్రి గుర్తు చేశారు. పోలింగ్ బూత్ కన్వీనర్లు అశ్రద్ధగా వ్యవహరించకుండా ఉండాలని చెప్పారు. మాజీ మంత్రి నక్కా ఆనంద్ బాబు భట్టిప్రోలు మండలం ఐలవరం గ్రామంలో సంక్షేమ పథకాలు 99 మందికి అందడం లేదని ఆరోపించడం చాల విడ్డూరంగా ఉందని మంత్రి నాగార్జున ఆశ్చర్యం వ్యక్తం చేశారు. నూటికి 99 శాతం సంక్షేమ పథకాలు అందించడం జరిగిందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు తీరుపై తప్పుడు ప్రచారాలు చేయొద్దని హితవు పలికారు. అలాగే భట్టిప్రోలు మండల కేంద్రం పద్మశాలీయ కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. సమగ్ర ఓటరు సర్వేలో వైఎస్సార్ సీపీ శ్రేణులంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సర్వేలో పరిశీలించాల్సిన అంశాలు, షెడ్యూల్‌ని మంత్రి సవివరంగా తెలియచేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీలు యల్లమాటి మోహన్, మురాల రాంబాబు, దావూరి వెంకట లలిత కుమారి, రాపర్ల నరేంద్ర, జెడ్పీటీసీ సభ్యులు తిరువీధుల ఉదయ భాస్కరి, దాట్ల సౌజన్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు, జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

- ఆర్డీవో జె.పార్థసారథి
- ఓటరు సమగ్ర సర్వేను పరిశీలించిన అధికారులు


బొరమాదిగపల్లిలో ఓటర్ సర్వేను పర్యవేక్షిస్తున్న ఆర్డీవో పార్థసారథి

నగరం: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని రేపల్లె ఆర్డీవో జె.పార్థసారథి కోరారు. మండలంలోని బొరమాదిపల్లి, చిరకాలవారి గ్రామాల్లో జరుగుతున్న ఓటరు సమగ్ర సర్వే కార్యక్రమాన్ని శుక్రవారం ఆర్డీవో పర్యవేక్షించి, మాట్లాడారు. జనవరికి 18 ఏళ్లు నిండిన యువత ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బూత్ లెవెల్ అధికారులు(బీఎల్వోలు) ప్రతి ఇంటికి వెళ్లి, ఓటర్ సర్వే చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఓటర్ జాబితాలో పేరు లేకపోతే నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఆగస్టు 21 వరకు సమగ్ర సర్వే జరుగుతుందని వెల్లడించారు. అక్టోబర్ 17న ముసాయిదా జాబితా విడుదల చేసి, నవంబర్ 30 వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. జనవరి 5న తుది జాబితాను ప్రకటించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ఎం.శ్రీనివాసరావు, బీఎల్వోలు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా రూపకల్పనలో నిబద్ధత ముఖ్యం

కొల్లూరు: ఓటర్ల జాబితాలో రూపకల్పన విషయంలో బీఎల్వోలు నిబద్ధతతో వ్యవహరించి, జాబితాలో సవరణలు చేపట్టాలని కొల్లూరు తహసీల్దారు ఎ.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని 54 పోలింగ్ బూత్‌ల పరిధిలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల జాబితా సర్వే చేపట్టారు. ఈ సర్వేను తహసీల్దారు పరిశీలించి, పలు సూచనలు చేశారు. బీఎల్వోలు ఎటువంటి పొరపాట్లకు, ప్రలోభాలకు తావివ్వకుండా ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తమ దృష్టికి వస్తే.. శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.


కొల్లూరులో సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దారు శ్రీనివాసరావు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి..

వేమూరు: ఓటరు జాబితా సవరణ సర్వే జాగ్రత్తగా చేయాలని తహసీల్దారు శ్రావణ్ కుమార్ తెలిపారు. వేమూరు శనివారం బీఎల్వోలు సర్వే ప్రారంభించారు. ధర్మ పురంలో నిర్వహించిన సర్వేను తహసీల్దారు పరిశీలించారు. బీఎల్వోలు ఓటు నమోదు, తొలగింపులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల లారీ బోల్తా


బోల్తాపడిన విద్యుత్ స్తంభాల లారీ..

పెరవలిపాలెం(వేమూరు): విద్యుత్ స్తంభాలతో పది చక్రాలు లారీ బోల్తా పడింది. పెరవలి పాలెం గ్రామం సెంటరులో శుక్రవారం ప్రమాదం జరిగింది. పెరవలిలో నూతనంగా నిర్మిస్తున్న విద్యుత్ సబ్ స్టేషనుకు స్తంభాలను నర్సరావుపేట నుంచి పెరవలి గ్రామానికి తీసుకొని వస్తున్నారు.

మార్కెట్ కాంప్లెక్స్‌లో మృతదేహం

తెనాలిరూరల్: స్థానిక మున్సిపల్ కూరగాయల మార్కెట్ కాంప్లెక్స్‌లో గుర్తుతెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. మృతుడి వయసు సుమారు 30 నుంచి 35 మధ్య ఉంటుంది. మృతి చెంది రెండు రోజులు అయి ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ సీఐ కె. చంద్రశేఖర్ శుక్రవారం రాత్రి తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి


ఎస్టీయూ సభ్యత్వ నమోదులో ఉపాధ్యాయులు


యూటీఎఫ్ సభ్యత్వ నమోదులో ఉపాధ్యాయులు

కర్లపాలెం: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షుడు పి.పరిశుద్ధరావు కోరారు. ఎస్టీయూ మండల శాఖ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. పరిశుద్ధరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులందరూ ఐకమత్యంగా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు గుడారం కయ్యు, బి.వెంకటేశ్వర్లు, నాగరాజు, సుభానీ, తిరుపతయ్య, అప్పారావు, సంగీత బాబు, ఏసుదాసు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ కృషి

కర్లపాలెం: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో యూటీఎఫ్ ముందంజలో ఉంటుందని యూటీఎఫ్ జిల్లా కోశాధికారి ఎం.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండలంలో ముమ్మరంగా నిర్వహించారు. వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలని, అలాంటి వారి సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు యూనియన్ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఆర్.రమేష్, సీహెచ్ ప్రభాకర్, పి.బాలాజీ, పోలీస్‌రావు, బాపూజీరెడ్డి, బి.శ్రీనివాసరావు, కె.సతీష్, విమలమ్మ ఉన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు దేవాలయాల నిర్మాణం


మాట్లాడుతున్న జంజనం హేమశంకరావు

చుండూరు(భట్టిప్రోలు): టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ ఆర్థిక సహాయంతో సమరసతా సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో చుండూరు మండలం నడిగడ్డ పాలెం ఎస్టీ కాలనీలో నిర్మిస్తున్న రామాలయం పనులను బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ చీడిపూడి వీరారెడ్డి అధ్యక్షతన దేవాలయ కమిటీ సమావేశం నిర్వహించారు. హేమశంకరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార వాడల్లో హిందూ ధర్మాన్ని నిలబెట్టడం కోసం, దేవాలయాలు లేని కాలనీల్లో రూ.10 లక్షల ఆర్థిక సహాయంతో నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందుకు దేవాలయ కమిటీలు కూడా ఎంతో భక్తి శ్రద్ధలతో ఆలయాలను నిర్మించుకుంటున్నారని తెలిపారు. సమావేశంలో వెంకట రమణ, చేవూరి ప్రభుదాసు, నాగమల్లేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

టైగర్ నాగేశ్వరరావు సినిమాను నిలిపివేయాలి

– సీపీఎం నేతలు


సమావేశంలో మాట్లాడుతున్న గంగయ్య, కృష్ణమోహన్, కోటేశ్వరరావు, దినేష్

బాపట్ల అర్బన్: టైగర్ నాగేశ్వరరావు సినిమాను నిలిపివేయాలంటూ సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. స్టువర్టుపురం గ్రామానికి చెందిన టైగర్ నాగేశ్వరరావు పేరుతో తీస్తున్న సినిమాను గ్రామస్తులు వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. దశాబ్దాల క్రితం జరిగిన విషయాన్ని ప్రస్తావిస్తూ నేటితరం దొంగలుగా ముద్ర వేయడం తగదన్నారు. ఇది యువత మీద ప్రభావం చూపుతుందన్నారు. గ్రామంలో యువత చదువుకుని ఉద్యోగాల్లో స్థిరపడ్డారని తెలిపారు. ఇలాంటి సమయంలో ఇటువంటి సినిమా తీయడం వల్ల నష్టం జరుగుతుందన్నారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలన్నారు. అనంతరం సినిమా నిలిపివేయాలంటూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు టి. కృష్ణమోహన్, నూతలపాటి కోటేశ్వరరావు, దినేష్ పాల్గొన్నారు.

ఘనంగా హరిద్ర శృంగారార్చన


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం హరిద్ర శృంగారార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడుతూ ప్రతి శుక్రవారం వివాహం కాని మగపిల్లలకు శ్రీఘ్రముగా వివాహం జరుగుటకు ప్రత్యేకంగా హరిద్ర శృంగారారచ్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, పరిసర గ్రామాల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

ఎన్‌సీసీ అధికారులకు సరిఫికెట్ల పంపిణీ

తెనాలిఅర్బన్: తెనాలిలోని 22వ ఎన్‌సీసీ బెటాలియన్ కార్యాలయంలో శుక్రవారం గ్రూప్ కమాండర్ ఎస్ఎం చంద్రశేఖర్ తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం ఎన్‌సీసీ అధికారులుగా శిక్షణ పూర్తి చేసిన పలువురికి సరిఫికెట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీలో చేరడం వల్ల అనేక ప్రయోజనాలున్నాయని తెలిపారు. కార్యక్రమంలో కమాండెంట్ అధికారి ఎ ఉమాశంకర్, చీఫ్ ఆఫీసర్ కె శ్రీనివాసరావు, అధికారులు కె బిక్షాలు, కె స్వామి, షేక్ ఖాదర్ బాషా, ఎం గోపి, ఎ అనిల్ కుమార్, సుబేదార్, మేజర్ మనోజ్ కుమార్, సుబేదార్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ శరత్‌బాబు సేవలు ఎనలేనివి


కానిస్టేబుల్ శరత్‌బాబును సత్కరిస్తున్న ఎస్ఐ వెంకట రవి

నిజాంపట్నం: ఉద్యోగ బాధ్యతలే పరమావధిగా కానిస్టేబుల్ జి.శరత్‌బాబు పనిచేశారని ఎస్ఐ వెంకటరవి తెలిపారు. మండలంలోని అడవులదీవి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శరత్ బాబు బదిలీపై రేపల్లె వెళ్లడంతో శుక్రవారం స్థానిక స్టేషన్‌లో సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకట రవి మాట్లాడారు. విధుల పట్ల ఎంతో నిబద్ధతగా పనిచేసి, ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకున్నారని శరత్‌బాబును కొనియాడారు. శరత్‌బాబును ఎస్ఐ వెంకటరవి, సిబ్బంది పుష్పగుచ్చాలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రైటర్ నాగరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వినూత్న మార్పునకు శ్రీకారం 'జగనన్న సురక్ష'


భట్టిప్రోలులో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న మంత్రి నాగార్జున


చావలిలో సర్టిఫికెట్ అందజేసిన జెడ్పీటీసీ హేమలత

భట్టిప్రోలు/వెల్లటూరు: జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రభుత్వ పాలనలో వినూత్న మార్పునకు శ్రీకారం చుట్టినట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. భట్టిప్రోలు-1, వెల్లటూరు సచివాలయాలలో శుక్రవారం జగనన్న సురక్ష క్యాంప్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడారు. దళారీల ప్రమేయం లేకుండా ఇంటింటికి వచ్చి సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. భట్టిప్రోలు-1 సచివాలయం పరిధిలో 4,596, వెల్లటూరు సచివాలయం పరిధిలో 2,406 వివిధ ధ్రువీకరణ పత్రాలు ఆయన అందజేశారు. జిల్లాలో అత్యధికంగా 4,596 ధ్రువీకరణ పత్రాలు అందచేయడం రికార్డ్ అని, ప్రత్యేకాధికారి హనుమంతరావు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమాలలో సర్పంచులు దారా రవి కిరణ్మయి, చౌటూరి లక్ష్మి, ఎంపీపీ దావూరి వెంకటలలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్య శాస్త్రి, మండల జేసీఎస్ కన్వీనర్ గోవర్ధనగిరి చిన బుజ్జి, ఉప సర్పంచ్ బూర్లె రామప్రసాద్, కో-ఆప్షన్ సభ్యులు షేక్ సలీం, ఎంపీటీసీ సభ్యులు కొతరపు పద్మావతి, గద్దె సుశీల, డొక్కు నాగకుమారి, దారావత్ కుమారీ బాయి, తహసీల్దారు డి. వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు, జగనన్న సురక్ష మండల ప్రత్యేక అధికారి వినోద్, ఈవోపీఆర్డీ టి. ఉషారాణి, పట్టణ అధ్యక్షులు కుందేటి రమేష్, పంచాయతీ కార్యదర్శులు కోట శ్రీనివాసరావు, ఎ.రామ్‌కుమార్, ఈడిగ, అగ్ని కుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్లు పడమటి శ్రీనివాసరావు, శేరు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు 'జగనన్న సురక్ష' శిబిరాలు

పిట్టలవానిపాలెం: మండలంలోని కోమలి, సంగుపాలెం, కోడూరు గ్రామ సచివాలయాల్లో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ భవనం మారుతీ శేషమాంబ తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆమె వివరాలు వెల్లడించారు. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి సంగుపాలెంలో మధ్యాహ్నం 2 గంటలకు, కోమలిలో సాయంత్రం 4 గంటలకు జగనన్న సురక్ష శిబిరాల్లో పాల్గొంటారని తెలిపారు.

'జగనన్న సురక్ష'తో ప్రజా సంక్షేమం

చావలి(వేమూరు): ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టారని జెడ్పీటీసీ గాజుల హేమలత అన్నారు. చావలి గ్రామ సచివాలయం-2, వేమూరు గ్రామ సచివాలయం-1లో జగనన్న సురక్ష శిబిరాలు శుక్రవారం జరిగాయి. కుల, ఆదాయం, రేషన్ కార్డులు తదితర సరిఫికెట్లు అందజేశారు. గ్రామ సర్పంచ్ విష్ణుమొలకల శ్రీనివాసరావు, ఎంపీడీవో శ్రీనివాసరావు, మండల ప్రత్యేకాధికారి విజయ, వేమూరు సొసైటీ అధ్యక్షులు గాజుల భానుప్రకాశ్, ఆర్ఐ వెంకటేశ్వరరావు, జంపని గ్రామ సర్పంచ్ చుండూరు పెదమరియమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జగన్న సురక్ష'తో ప్రజలకు రక్ష

రేపల్లె రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలకు మేలు చేకూరుతోందని ఎంపీడీఓ శివ పార్వతి అన్నారు. తుమ్మల సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. 810 సర్టిఫికెట్‌లను అర్జీదారులకు పంపిణీ చేశారు. సింగుపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దారు మల్లికార్జునరావు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు, ఎలక్షన్ డీటీ సత్యనారాయణ, సర్పంచ్‌లు తుపాకుల దీపిక, యార్లగడ్డ రమాదేవి పాల్గొన్నారు.

ఒకే రోజు 1,641 ధ్రువపత్రాల పంపిణీ


జగన్నాథపురంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ భాను ప్రతాప్

బాపట్ల అర్బన్: బాపట్ల పట్టణంలో శుక్రవారం జరిగిన 'జగనన్న సురక్ష' శిబిరంలో అర్జీదారులకు 1,641 సర్టిఫికెట్లు మంజూరు చేశారు. మున్సిపాలిటీ పరిధి శృంగారపురంలోని తాలింఖాన, జగన్నాథపురం సచివాలయాల్లో జరిగిన శిబిరాల్లో మున్సిపల్ కమిషన్ భానుప్రతాప్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జగన్నాథపురం సచివాలయంలో 816 మంది దరఖాస్తు చేసుకోగా అందరికీ, తాలింఖాన సచివాలయం పరిధిలో 829 మంది దరఖాస్తు చేసుకోగా 825 ధ్రువీకరణ పత్రాలను అందజేసినట్లు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బాపట్ల పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్ బాబు, మండల పార్టీ అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, బాపట్ల జేసీఎస్ కన్వీనర్ చింతల రాజశేఖర్, సాంబ చెన్నకేశవులు, ఈనగలూరి మాల్యాద్రి, యల్లావుల సోహిత్, మునిసిపల్ సిబ్బంది, సచివాలయం సిబ్బంది అధికారులు తదితరులు పాల్గొన్నారు.